పల్లెపట్టుల్లో విద్య బోధించే గురువుల పట్ల విద్యార్థులు ప్రదర్శించే ఆదరాభిమానాలు పట్టణాల్లో కూడా ఉంటే ఎంత బావుండును !

# అయ్యవారి నట్టిల్లు

ఈ మధ్యనే రిటైరైన కిష్టమూర్తి మేష్టారు నట్టింట్లో వాలుకుర్చీలో కూర్చుని, గతాన్ని నెమరువేసుకుంటూండగా హఠాత్తుగా ఓ ఆలోచన తట్టింది. వెంటనే వంటింట్లో పనిలో నిమగ్నమై ఉన్న భార్య నుద్దేశించి

"కాంతం! ఒసేవ్ కాంతం! ఓ సారిలా రా!" అని కేకేశాడు. అల వంటింటి పురంబులో, మడిబట్టల్తో వంటచేస్తున్న కాంతమ్మగారు, "ఆ వస్తున్నానండీ" అని సమాధానం చెప్పి 'ఈ ముసలాయనకు బడి లేకపోవడంతో నాకు పాఠాలు చెప్పేస్తున్నాడు' అని గొణుక్కుంటూ గుమ్మం దగ్గర నిలబడి, "చెప్పండి. అవతల పనుంది నాకు. నేనింకా రిటైరవలేదుగా!" అంది ఈసడింపుగా.

"అది కాదే! మరి మనం తిరపతి వెళ్ళి, స్వామి దర్శనం చేసుకొద్దాం. రేపే ప్రయాణం. నువ్వు అన్ని సర్దేసుకో!" అన్నారు మాస్టారు.

కాంతమ్మగారు ఆశ్చర్యంలో మునిగిపోయింది. గుళ్ళో దేముడి ముందు దీపంలా వెలిగింది ఆమె ముఖం.

"నిజంగానే?" అన్న ఆమె ప్రశ్నకి, "నిజంగానే!" అన్న ఆయన సమాధానం విని కొయ్యముక్కలా వంటింటి ద్వారాన్ని అంటిపెట్టుకుని కదలని కాంతాన్ని చూసి, "ఏమిటే అది? లెక్కల్లో నూటికి నూరు మార్కులొచ్చిన దానిలా అలా నిలబడిపోయావు?! పోయి పని చూసుకుని ప్రయాణం కా," అని హెచ్చరించారు కిష్టమూర్తి మేష్టారు.

ఎన్నాళ్ళ కెన్నాళ్ళకు! పెళ్ళయినప్పట్నుంచి చూస్తోంది. మాష్టారికెంటో తన ధోరణే తనది. ఎంతసేపూ పిల్లలూ, బడి, పుస్తకాలూ, చదువూ, పాఠాలూ.....అదో మాయాలోకం. మరేదీ పట్టేది కాదు ఆయనకు. అందుకే వాళ్ళిల్లు 'అయ్యవారి నట్టిల్లు' గా అలానే ఉండిపోయింది. ఎన్నోసార్లు అనుకుంది తన ఇష్టదైవం వెంకన్నబాబు దర్శనం చేసుకు రావాలని. కానీ, ఈ సంసార సాగరంలో, పిల్లలనీ, చదువులనీ, పెళ్ళిళ్ళనీ, ఋణాలనీ, బాధ్యతలనీ ఎన్ని అల లనీ! ఈ కెరటాలు సద్దుమణిగేదెప్పుడూ, తను తీరం చేరేదెప్పుడూ?! అప్పటికిప్పటికి ఈయనకు భగవంతుడే బుద్ధి పుట్టించాడన్నమాట. జన్మానికో శివరాత్రి అన్నట్టు ఇప్పటికైనా మించిపోయింది లేదు. వెంటనే బయల్దేరడం మంచిది అని నిశ్చయించుకుంది కాంతమ్మగారు.

* * *

మర్నాడు హడావుడిగా అన్నీ సర్దేసుకుని దూరానున్న రైల్వేస్టేషనుకి నడిచే వెళ్లాలి కాబట్టి గంట ముందుగానే బయల్దేరారు దంపతులిద్దరూ. వీధిలో కొచ్చి నడుస్తున్న మాస్టారివంకా ఆపదోద్ధారక మంత్రం పూర్తి చేయకుండానే సర్రున పక్కనుంచి దూసుకు పోయిన మారుతీ కారు సడెన్ బ్రేక్‌తో వారికి రెండు గజాల ముందు ఆగింది.

అందులోంచి దిగిన ఆగంతకుడు మాస్టారు వైపు నడిచి వస్తూ, "నమస్కారం మాస్టారు! నన్ను గుర్తుపట్టలేదా? గుర్నాధాన్ని. ఏంటిలా ప్రొద్దునే బయలుదేరారు? అమ్మగార్ని కూడా నడిపించేస్తున్నారు?" అని భక్తిశ్రద్ధలతో పలకరించాడు. గుర్నాధం పేరు విన్నాక అతన్ని గుర్తుపట్టడం సులభం అయింది మాస్టారుకి. 'వీడు చెన్నయ్యశెట్టి కొడుకు కదూ! వట్టి మొద్దబ్బాయి. ఒక్క పాఠం తిన్నగా వచ్చి చచ్చేది కాదు. కారులో తిరుగుతున్నాడంటే బాగానే వృద్ధిలోకొచ్చినట్టున్నాడు' అని ఆలోచిస్తూ పరధ్యానంగానే "ఆ! నిన్ను ఎరక్కేం? అలా తిరుపతికి వెళ్ళొద్దామని....."జవాబు చెప్పారు.

"అయ్యో! స్టేషను వరకూ నడవడం ఎందుకు? రండి బండిలో దించేస్తాను" అన్నాడు గుర్నాధం. తటపటాయిస్తున్న భర్తను చూస్తూ 'ఈ పంతులెక్కడ కాదని అదృష్టాన్ని కాలదన్నేస్తాడో' అనే ఆతురతతో, "మీ శిష్యుడి అభ్యర్ధన కాదనకండీ!" అని ప్రాధేయపడింది భార్య. గుర్నాధం ఇద్దర్నీ జాగ్రత్తగా వెనుక సీట్లో ఎక్కించాడు. ఐరావతాన్ని ఎక్కినంత సంబర పడింది కాంతమ్మగారు.

స్టేషన్లో టికట్ విండో చేరుకుని, "బాబూ! తిరపతికి రెండు టిక్కట్లివ్వండి" అని డబ్బు చేత్తో పట్టుకుని అడిగారు మేష్టారు. అవతలున్న మనిషి, "ఉండవయ్యా! ఇప్పట్నుంచీ తొందరేంటి? బండి గంట లేటు!" అని విసుక్కోబోయి ఇటున్న మాష్టార్ని చూసి అర్ధోక్తిలోనే ఆగిపోయాడు. "అయ్యో గురువుగారూ మీరా! ఉండండి" అని, ఆదుర్దాగా అటు గుమ్మం గుండా బైటికి వచ్చి ఇద్దర్నీ ఆప్యాయంగా లోపలికి తీసుకెళ్ళాడు. కిష్టమూర్తి మేస్టారు ఆయన్ని పోలికల్నిబట్టి ఆనవాలుపట్టి, "అబ్బాయ్! నువ్వు పేరిశాస్త్రి కొడుకు అవధానివి కదూ!" అన్నాడు. "అవును సార్! మీరు బాగానే గుర్తుపట్టారే! మీరు పెట్టిన సరస్వతీ బిక్షతోనే డిగ్రీ చేసి, రైల్వేలో జాయినయ్యాను. స్టేషనుకి బదిలీ మీద వచ్చి రెండు రోజులే అయ్యింది. వచ్చి మీ దర్శనం చేసుకుందామనుకుంటున్నాను. ఇంతలో మీరే ఇక్కడకు వచ్చారు. తిరుపతికి మీ టిక్కట్లు తెస్తానుండండి!" అని చెప్పి, ఎంత చెప్పినా డబ్బు తీసుకోకుండా ఇచ్చాడు. ఏం మాట్లాడాలో తెలియక ఉక్కిరి బిక్కిరవుతోంది కాంతమ్మగారు.

రైల్లో రెండు గంటల ప్రయాణం అయ్యాక ఓ పెద్ద స్టేషన్లో టి.టి.ఐ. చెకింగుకి వచ్చాడు. వీరిద్దర్నీ అనుమానంగా చూసి "పంతులుగారూ! మీరిద్దరూ దిగండి. ఇది మీ పెట్టె కాదు నాతో రండి!" అన్నాడు. ఏం కొంపమునిగిందో అని అనుమానపడుతూ వెనకాలే దిగారు ఇద్దరూ. టి.టి.ఇ. వారిని అప్పర్ క్లాస్ కంపార్టుమెంటులో ఖాళీగా ఉన్న ఒక కూపేలో కూర్చోబెట్టి, ఎక్సెస్ ఫేర్ టిక్కట్టు రాసి చిరునవ్వుతో మాస్టారికందిచ్చాడు. "నాయనా ఏంటిది? నాకేం అర్థం కావడం లేదు!" అన్నారు ఆయన అయోమయంగా.

"ఏం గురువుగారూ నేనేమైనా తప్పుచేస్తే ఓ లెంపకాయ వేయలేరా?" అని నవ్వుతూ అడిగాడు టి.టి.ఐ. అప్పుడు వీడు నా శిష్య కోటిలోనివాడే అయ్యుండాలని గ్రహించిన గురువుగారు "ఎవరు బాబూ నువ్వు. జ్ఞాపకశక్తి సన్నగిల్లింది. పోల్చుకోలేకపోతున్నాను" అని అడిగారు.

"అప్పన్న కొడుకు చలమయ్యని సార్! ఇది మీ చేతి చలవే మాస్టారూ! మరిచిపోతానా. ఇహ మీరు తిరపతి చేరేవరకు మిమ్మల్నెవరూ డిస్టర్బ్ చేయరు. హాయిగా ప్రయాణం చేయండి" అని చెప్పి వెళ్ళిపోయాడు.

అప్పుడు పంతులుగారి మెదడులో ఓనాటి మెరికలాంటి కుర్రాడు చలమయ్య మెదిలాడు. నిమ్నజాతివాడని నీచంగా చూసేవారు తోటి పిల్లలు. అదేమిటో చదువులో మాత్రం వాడెప్పుడూ ముందే ఉండేవాడు. సరస్వతీ కటాక్షం అంటే అదేనేమో! తన దృష్టిలో బాగా చదువుకున్నవాడే ఉచ్చజాతివాడు. చదువు లేనివాడు నీచజాతివాడు. అందుకే చలమయ్య తన అభిమాన శిష్యుల్లో ఒకడయ్యాడు. వాడిప్పుడు బుద్ధిమంతుడై ఉద్యోగం చేసుకోవడం తనకి చాలా సంతోషంగా ఉంది. ఇలా సాగుతోంది కిష్టమూర్తిగారి ఆలోచనా పరంపర. కాంతమ్మగారీలోకంలోనే లేరు. బయల్దేరిన దగ్గర్నుంచీ - కారులో లిఫ్టు, ఫ్రీగా టిక్కట్లు, పరుపుల బండిలో ప్రయాణం. బతికుండగానే భూలోకం నుంచి స్వర్గానికి వెళ్ళిపోయొచ్చేసినట్టుంది ఆమెకు.

* * *

తెల్లారేసరికి రైలు తిరుపతి చేరుకుంది. క్యూలో నిలబడి కొండపైకి టిక్కెట్లు తీసుకుని దేవస్థానం బస్సులో తిరుమల చేరుకునేసరికి అపరాహ్ణం తిరిగింది. మండే ఎండలో మళ్ళీ క్యూలో నిలబడి చౌల్ట్రీలో రూముకి అర్థిస్తుండగా మరో విచిత్రం జరిగింది.

ఆయన్ని క్యూలో చూసిన ఓ దేవస్థానం అధికారి, "అరెరె! కిష్టమూర్తి మేష్టారా! మీరిలా ఎండలో ఎంతసేపు...? ఇలారండి!" అని ప్రక్కనే ఉన్న ఇనప కటకటాల తలుపు తీసి లోపలికి ఆహ్వానించాడు. చల్లటి మంచినీళ్ళు ఇద్దరికీ తాగడానికి ఇచ్చి అన్నాడు - "ఇప్పుడు చెప్పండి మాష్టారూ! చాలా కాలానికి మీ దర్శన భాగ్యం కలిగింది. ఇంతకీ మీరు నన్ను గుర్తు పట్టినట్టు లేదు. నేను మాష్టారూ, సూర్యారావుని! మీరు అనేవారుగా, సూర్యారావు! ఎక్కాలు రావు! లెక్కలు రావు! పాఠాలు రావు! వెధవరావు! అని. వాడినే నేను. అల్లరి చిల్లరిగా తిరిగి చదువుని అశ్రద్ధ చేసి, చాలాకాలం నిరుద్యోగిగా ఉండి, తెలిసినవారినాశ్రయించి ఈ మధ్యనే ఈ దేవస్థానంలో స్థిరపడ్డాను. నాకు చదువు రాలేదని ఆఖరికి తలిదండ్రులు సైతం అసహ్యించుకున్నా మీరు మాత్రం నన్నెప్పుడూ అభిమానంగా చూసేవారు. మరిచిపోగలనా మాష్టారూ. మీవంటి గురువు దొరికినా, ఏ గ్రహచారమో నాకు చదువు రాకుండా చేసింది. సరే, అవన్నీ ఇప్పుడెందుకులెండి? మీరిక్కడున్నంతకాలం నా అతిథులుగా ఉండండి. మీక్కావలసిన ఏర్పాట్లన్నీ నేను చూస్తాను."

అంతవరకు గంభీరంగా ఉన్న కిష్టమూర్తిగారు మంచులా కరిగిపోయారు. అశ్రుపూరిత నయనాల్తో సూర్యారావుని కౌగలించుకుని, "ఎవరన్నార్రా నిన్ను పనికిరానివాడని? ఈనాడు నా శిష్యులందరిలో నిన్ను చూసే ఎక్కువ గర్విస్తున్నాను" అన్నారు. ఆ నిముషంలో కిష్టమూర్తి మేష్టారిలో భగవంతుడి ప్రతిరూపాన్ని చూసింది కాంతమ్మగారు.

ఆ పురాణ దంపతుల దగ్గర సెలవు తీసుకుని రెండు గంటల్లో మళ్ళీ వచ్చి "పదండి మాస్టారూ!" అని వారిద్దర్నీ తన వెంట తీసుకెళ్లాడు. 'రాంబగీచా' గెస్ట్‌హౌస్‌లో, రెండు మంచాలూ, మెత్తటి పరుపులూ ఉన్న రూము చూపించి "ఇది మీ రూము" అని చెప్పాడు. జేబులోంచి టి.టి.డి. రసీదు ఒకటి తీసి, పంతులుగారి చేతికిచ్చి "ఇది స్వామివారి ప్రత్యేక కళ్యాణోత్సవానికి రసీదు. రేపు ఉదయం పది గంటలకు మీరు వైకుంఠ ద్వారానికి చేరుకోండి. మిగతావి నేను చూసుకుంటాను" అంటున్న సూర్యారావుతో, "అయ్యయ్యో? ఎందుకింత శ్రమ తీసుకుంటూన్నవు బాబూ! ధర్మదర్శనంతో సరిపెట్టుకునే వాళ్లం కదా!" అన్నారు ఆయన.

"అదేంటి మాస్టారూ! మరి నా ఋణం ఎప్పుడు తీర్చుకోను? వెళ్లొస్తాను. ఉండండి!" అని వెళ్ళిపోయాడు సూర్యారావు.

✱ ✱ ✱

మర్నాడు కళ్యాణం చేయించి రూముకి తిరిగొచ్చాక, భర్తపై పెరిగిన అభిమాన భారంతో ఒక్కసారిగా ఆయన కాళ్లపై పడింది కాంతమ్మగారు. పశ్చాత్తాపంతో తప్తమైన ఆమె హృదయం కరిగి కన్నీరై ధారాహితంగా కారసాగింది.

"ఏమండీ నన్ను క్షమించండి! అజ్ఞానురాలిని. ఇన్నాళ్ళూ తెలుసుకోలేకపోయాను. మన యిల్లు అయ్యవారి నట్టిల్లు కాదండి. అది సరస్వతీ నిలయం. ఇంతటి శిష్యకోటి ఉన్న మీరెంతటి భాగ్యవంతులో నాకిప్పటికి తెలిసింది" అని వేడుకుంది.

కిష్టమూర్తి మేస్టారు దూషణ, భూషణ, తిరస్కారాలకు అతీతుడు.

"పిచ్చిదానా! ఏమిటిది? లే! నేను అప్పుడూ, ఇప్పుడూ, ఎప్పుడూ కిష్టమూర్తి మేస్టారినే! నీవు నా సహధర్మచారిణివే!" అని ఆమెను లేవదీశారు.

ఆ సమయంలో, గీతాజ్ఞానోప దేశానంతర విశ్వరూప వీక్షణంతో, దాసోహమని కాళ్లపై బడిన నరుణ్ణి లేవనెత్తుతున్న నారాయణుడిలా ప్రకాశించారు కిష్టమూర్తి మేస్టారు. ✱